


'ఎనీ టైం బ్యాగ్' ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ హిత బట్టతో తయారుచేసిన చేతిసంచుల వాడకాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి రైతు బజారులో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్లాత్ బ్యాగుల వెండింగ్ యంత్రాన్ని (ఎనీ టైం బ్యాగ్)ను కాలుష్య నియంత్రణ మండలి ఇఇ నరేంద్రబాబుతో కలిసి ప్రారంభించారు. రైతుబజారులో కూరగాయల నిత్యావసర సరుకులు కొనుగోలుకు వచ్చే ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు వాడకుండా బట్టతో తయారు చేసిన బ్యాగులను వాడేలా 20 రూపాయల విలువ చేసే చేతిసంచులను తగ్గించి 10 రూపాయలకే అందుబాటులోకి తెచ్చామన్నారు. యంత్రంలో పది రూపాయల నోటు కానీ, రెండు ఐదు రూపాయల నాణేలు వేయడం ద్వారా బట్టతో తయారు చేసిన బ్యాగును పొందవచ్చని తెలిపారు. త్వరలోనే క్యూఆర్ కోడ్ ద్వారా కూడా డిజిటల్ పేమెంట్ చేసి ఈ బ్యాగులను పొందే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ మదన్‌మోహన్, మార్కెటింగ్ సహాయ సంచాలకులు సురేంద్రబాబు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి అక్తర్ షరీఫ్ పాల్గొన్నారు.


పాఠశాలల్లో 'నాడు-నేడు' సరే..!

వానొస్తే 'విద్య' దూరం

● నెలరోజుల పాటు విద్యార్థులు ఇళ్లకే పరిమితం ● వంతెన ఏర్పాటుకు ఏళ్లతరబడి నిరీక్షణ ● అభివృద్ధికి ఆమడదూరంలో 'జయలక్ష్మీపురం'

ప్రజాశక్తి - కెవిబిపురం

'బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి.. ఎవరికి మాత్రం ఉండదు బడిలోనే ఉండాలని.. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే తెలుస్తుంది విద్యార్థుల ఈతి బాధలు.. వానొచ్చిందంటే చాలు జయలక్ష్మీపురానికి రాకపోకలు బంద్.. వరదనీరు తగ్గితే గాని అక్కడ పిల్లలు పాఠశాలకు వెళ్లలేరు.. అంతేకాదు నిత్యావసర సరుకులు తెచ్చుకోడానికీ ఇబ్బందే.. బడికి వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం నడచి వెళ్లాల్సిందే. దీర్ఘకాలికంగా ఆ ఊరికి రాకపోకలకు ఇబ్బంది లేకుండా వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూనే ఉన్నా పట్టించుకునే నాధుడు లేడు. ఎన్నికలకు ముందు వరదొచ్చి 'మా ఓటు వేయడానికి వీల్లేకుండా పోతేనైనా' ఈ పాలకులు తమ బాధల గురించి పట్టించుకుంటారా? అని వారు వాపోతున్నారు. వానొస్తుందంటే వారికి గుండెల్లో గుబులు.



అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని మోసుకొస్తున్న దృశ్యం

కెవిబిపురం మండలానికి మారుమూల ప్రాంతమైన అంజూరుపాళ్యం పంచాయతీకి మూడు కిలోమీటర్ల దూరంలో పచ్చనిచెట్లు, ప్రకృతి అందాల మధ్య మొక్కలచేను జయలక్ష్మీపురం గిరిజన కాలనీ ఉంది. దాదాపు 40 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. కనీస వసతులు లేకపోవడంతో అభివృద్ధికి ఆమడదూరంలో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఎండనకా వాననకా కూలి పనులు చేసుకుంటూ పూట గడుపుతున్నారు. దశాబ్దాలుగా పూరి గుడిసెలే వారికి పక్కా ఇళ్లు. అడవితల్లిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. గిరిజనులకు సెంటు భూమి సైతం లేదు. రెక్కల కష్టమే జీవనాధారం. వర్షాకాలం వస్తే వంక నిండిపోయి నెలరోజుల పాటు పూరిగుడిసెల్లోనే బిక్కుబిక్కుమంటూ బతకాల్సి ఉంటుంది.

నెలరోజులు అరచేతిలో ప్రాణాలు



వర్షాకాలంలో తెలుగుగంగ రిజర్వాయర్ గేట్లు ఎత్తేశారంటే మా కాలనీ చుట్టూ నీరు నిలబడిపోతుంది. ఎక్కడికీ పోలేని పరిస్థితిలో బిక్కుబిక్కుమంటూ నెలరోజులు తిండితిప్పలు లేకుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించాలి. వర్షాకాలంలో రోగులను, గర్భిణులను, స్త్రీలను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే ఇక భగవంతుడే దిక్కు. వారిని భుజాలపై మోసుకొని వెళ్లాల్సిన దుస్థితి. 108 వాహనం సైతం గ్రామానికి వచ్చే పరిస్థితి ఉండదు

- చెంచయ్య, జయలక్ష్మీపురం

వంతెన ఏర్పాటు చేయకుంటే బతుకు భారం



మా గ్రామానికి వంతెన ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు.. అధికారులకు పలు మార్లు తెలియజేస్తున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పార్టీలు మారుతున్నా.. మా తలరాతలు మారడం లేదు. కాలనీలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుకోవడానికి ప్రాథమిక పాఠశాల ఉన్నా.. ఆపై చదువులకు 3 కిలో మీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. ఒకరు బడికి ఆగిపోతే మిగిలిన వారందరూ పాఠశాలకు దూరం అవుతున్నారు

- దేశమ్మ, జయలక్ష్మీపురం

వర్షాకాలమొస్తే చదువుకు దూరం



వర్షాకాలంలో పిల్లలు బడికి పంపాలంటే వాగులో కొట్టుకెళ్తారు అన్న భయం. అందుకే పిల్లలను బడికి పంపడం లేదు. వర్షాలు ఆగిన తర్వాత కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా గ్రావెల్ తోలి ఉండిపోయారు. మా గిరిజన బతుకులను గాల్లో వదిలేస్తున్నారు. ఇకనైనా ఎంపిపీలు, సర్పంచులు, అధికారులు చొరవ తీసుకుని బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. గిరిజన కాలనీలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలి. అధికారులు గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలి

- కన్నెమ్మ, జయలక్ష్మీపురం



వెంకటగిరి



సూళ్లూరుపేట

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

● రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం డిమాండ్

ప్రజాశక్తి - వెంకటగిరి/ గూడూరు టౌన్ /సూళ్లూరుపేట/ నాయుడుపేట

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం డిమాండ్ చేశారు. మే 31న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా తిరుపతి జిల్లా వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట సూళ్లూరుపేటల్లో మంగళవారం పర్యటించింది. గూడూరులో యూనియన్ జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్ అధ్యక్షత వహించి జాతాకు స్వాగతం పలికారు. కె.నాగభూషణం మాట్లాడుతూ కరోనా కాలంలో ఫ్రంట్‌లైన్ వారి యర్స్‌గా ప్రాణాలు తెగించి ప్రజలకు సేవ చేసిన వీరికి 010 పద్దు ద్వారా జీతాలు చెల్లిం చాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై రెండు రెండు రాష్ట్ర ప్రచార జాతాలు బయల్దేరాయని, ఈనెల 8న రాష్ట్ర ప్రభుత్వానికి కార్మికుల నుంచి తెలుసుకున్న సమస్యలను విన్నవిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని పరిష్కరించని పక్షంలో మున్సిపాలిటీలను కలుపుకుని పెద్దఎత్తునపోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని తెచ్చిన తరువాత 60 ఏళ్లకే కార్మికులను ఇంటికి పంపుతున్నారని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు వాళ్ల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాల న్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు మిగిలిన డ్రైవర్లతో పాటు 18,500 జీతం చెల్లించకుండా కేవలం 10 నుంచి 12వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కె.నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రబాబు,రాష్ట్ర కమిటి సభ్యులు ఎటిఎం నాగరాజు, లక్ష్మీనారాయణ, గూడూరు డివిజన్ నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, ఎ.ప్రసాద్, ఎస్.సురేష్, డి.కోటి, మహేంద్ర, పెంచల ప్రసాద్, శాంతివర్ధన్ పాల్గొన్నారు.



గూడూరు టౌన్

నాయుడుపేటలో సుందర్ రామిరెడ్డి భవన్ నుంచి గడియావరం రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు చావల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 40 వేల మంది మున్సిపల్‌కార్మికులు ఉన్నారని, అందరినీ పర్మినెంట్‌చేయాలని డిమాండ్ చేశారు. నాగేంద్ర, గోపి, లక్ష్మీనారాయణ, శివ కవి ముకుంద పాల్గొన్నారు.

వెంకటగిరిలో సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లా డుతూ మున్సి పాలిటీలో కాంట్రాక్టు ఔట్‌సో ర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికుల సమస్యలు, డైలీవేజెస్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల ను వివరించి రాష్ట్ర నాయకులకు అర్జీ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధ నలకు విరుద్ధంగా రాజకీయ పలు కుబడితో ధనబలంతో గత పదేళ్ల నుంచి వెంకటగిరి లోనే తిష్టవేసి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రామారావును బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై కక్షగట్టి ఆబ్సెంట్ వేస్తూ కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. మండల అధ్యక్షులు మంజులమ్మ, ఎం.లీలావతి, సుబ్బయ్య, ఎస్.ప్రసాద్, పి.మణి, మోహన్, హరిబాబు, పెంచలయ్య, లక్ష్మమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటకు చేరిన రాష్ట్ర జాతా రాష్ట్రవ్యాప్తంగా 40వేల మంది మున్సిపల్ కార్మికుల బాధలను తెలుసుకునేందుకు 123 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో, కార్పొ రేషన్లలో పర్యటించనుంది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ జాతాకు జిల్లా నాయకులు గోపి స్వాగతం పలికారు. సిఐటియు నాయకులు బి.పద్మనాభయ్య, సిహెచ్ సుధాకర్‌రావు, అమృత రామయ్య, వెంకటరత్నం, చిన్నయ్య, చంగయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఫ్యాప్టో




తిరుపతి టౌన్ : ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ వారికి జిల్లా రెవెన్యూ అధికారి కోదండరామి రెడ్డి ద్వారా మెమోరాండం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఇటీవల పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని మార్చుకోవాలని కోరారు. పాఠశాల విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జీవో 117ను రద్దు చేయాలని తెలిపారు. బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. ఉద్యోగోన్నతులను రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలని అన్నారు. సిపిఎస్ ను రద్దు చేయాలని పిఆర్సి ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని వెల్లడించారు. చట్టబద్ధమైన 12వ పిఆర్సిని వెంటనే నియమించాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 11వ పిఆర్సికి అనుగుణంగా పెంచాలని కోరారు ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ఎస్ చిరంజీవి, నాయకులు రమణయ్య, చంగ్రాయమండడి, తిరుపతి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె ముత్యాల రెడ్డి డిప్యూటీ సెక్రటరీ జనరల్ యువ మురళి, వెంకట ముని, కో చైర్మన్ లక్ష్మయ్య, నాయకులు దండు రామచంద్రయ్య, సి సురేష్, డాక్టర్ కిట్టన్న, సురేంద్ర, చంద్రశేఖర్, నాదముని, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'జలజీవన్' వందశాతం పూర్తవ్వాలి : కలెక్టర్

తిరుపతి టౌన్ : జలజీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి రానున్న మార్చి నాటికి వందశాతం పూర్తి కావాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. మంగళవారం రాత్రి అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్‌కెఎస్ జవహర్‌రెడ్డి, ఢిల్లీ నుంచి కేంద్ర ప్రభుత్వ సెక్రటరీ వాణి మహాజన్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జలజీవన్ మిషన్ పనులు 96శాతం పూర్తయ్యాయని, ఇంకా 19వేల గృహాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న మార్చి నాటికి వందశాతం పనులు పూర్తవ్వాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ షెడ్లు 774 నిర్మించాల్సి ఉండగా 630 పూర్తయ్యాయన్నారు. ఈ సమీక్షలో జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా గ్రామీణ నీటిపారుదల ఇంజినీర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న కార్యక్రమాలపై సంబంధిత అధికారులు ఎంపిడిఓలు, సహాయ పథక సంచాలకులు, సహాయ ప్రాజెక్టు అధికారులతో జిల్లా కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి పథక సంచాలకులు డ్వామా శ్రీనివాస ప్రసాద్ తో కలిసి వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెరగాలని జూన్ నెల 1.25 లక్షల లక్ష్యం సాధించాలని, హార్టికల్చర్ అభివద్ధి పై దష్టి పెట్టాలని, వర్షాకాలం లోపు ఉపాధి హామీ పనులు లక్ష్యం మేరకు జరిగేలా వేగవంతం చేయాలని, సరాసరి కూలీ రూ.272 కు తగ్గకుండా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ఉద్యాన పంటలు వేసుకునే వారికి త్వరిత గతిన ఏపీఎంఐపి ద్వారా డ్రిప్ మంజూరు చేస్తామన్నారు. ఇంకా ఆధార్ అనుసంధానం కాకుండా పెండింగ్ లో ఉన్న 6695 జాబ్ కార్డుల ఆధార్ అనుసంధానం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తిరస్కరించబడిన ట్రాన్సాక్షన్ల రీకన్సిలేషన్ పెండింగ్ ఉండరాదని అన్నారు.

'ఆదిపురుష'ను ఆదరించాలి: చిన్నజీయర్‌స్వామి

● 'జై శ్రీరామ్' నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం ● 16న థియేటర్లలో సినిమా విడుదల

ప్రజాశక్తి-తిరుపతి సిటి: 'రాముడు గురించి చాలా సినిమాలు వచ్చాయి.. అవన్నీ గతం.. ఆ తరం అయిపోయింది.. ఇప్పటితరానికి మళ్లీ రాముడు రావాలి.. ఆధునిక టెక్నాలజీతో రాముడు కావాలి.. అందుకే ఈ ఆదిపురుష్ సినిమా.. అందరూ ఆదరించాలి' అని చిన్నజీయర్‌స్వామి అన్నారు.. తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్టేడియంలో 'ఆదిపురుష్' ప్రి రిలీజ్ వేడుకగా అట్టహాసంగా అబ్బురపరిచేలా సాగింది. 'జై శ్రీరామ్' నినాదాలతో ప్రాంగణం హోరెత్తింది.. ఈనెల 16న సినిమా అభిమానుల ముందుకు రానున్నట్లు వెల్లడించారు. ప్రతి షోలోనూ 'హనుమంతుని' కోసం ఓ సీటు వదిలేందుకు నిర్మాతలు, డైరెక్టర్లు వేదికపైనే అంగీకరించారు. యాంకర్లుగా ఝాన్సీ, ప్రదీప్ వ్యవహరించి అలరించారు. టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ 'నిజమైన బాహుబలి రాముడని ప్రభాస్ నిరూపించాడని, ప్రతి ఒక్కరి గుండెలోనూ రాముడు ఉన్నాడని, గుండెల్లో ఉన్న రామున్ని బయటకు తీసుకురావడానికి తనలోని రాముని ప్రభాస్ పైకి తెచ్చారు' అని ప్రసంగించారు. రామాయణంలో రామచంద్రుడు మంచి మనిషని, పుట్టకముందు విష్ణువు, అవతారం సాధించాక విష్ణువని, జీవన సమరంలో మనిషిగా ప్రవర్తించాడన్నారు. ఒక మనిషి మనిషిగా ఉండగలిగితే దేవుళ్లు కూడా అతని వెంట నడుస్తారన్నారు. రామాయణంలో అరణ్యకాండ, యుద్ధకాండల్లో ఉన్న కథను చరిత్రగా లోకానికి అందించాలన్న తపనతో ఈ సినిమా చేశారన్నారు. ఆదిపురుష్ సినిమా బృందం మొత్తానికి తమ ఆశిస్సులు ఉంటాయన్నారు. జై శ్రీరాం, జైభజరంగ్ భళి అంటూ తన ఉపన్యాసాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో దర్శకులు ఓంరావత్, హీరో ప్రభాస్, సీత కృతిసనన్ పాల్గొన్నారు. తిరుపతి ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. జూన్ 16న సినిమా విడుదల కానుంది. సీతారాముల సన్నివేశాన్ని, వంతెనపై వానర మూకలతో రాముని పయనం తదితర ఘట్టాల క్లిప్పింగ్‌లను అభిమానులకు చూపించారు.

తెలుగు, హిందీ భాషల్లో ఫైనల్ ట్రేలర్


స్టేజిపై టెక్నాలజీతో ఏర్పాటు చేసిన వారధిపై నడుస్తూ వచ్చి ప్రభాస్ అభిమానులకు అభివాదం తెలిపారు. ధనస్సును ఎత్తి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. 'ఆదిపురుష్' ఫైనల్ ట్రేలర్ ఫ్యాన్స్‌కు అందించారు. రావణాసురుడు జానకిని అపహరించుకెళ్లే ఘట్టాలను చూపించారు. 'నా ఆగమనం అధర్మ విధ్వంసం.. కానీ ఈ రోజు నా కోసం పోరాడొద్దు.. భరతదేశంలో పరస్త్రీపై చేయి వేసేవారి దుష్టులకు మీ పరాక్రమం గుర్తొచ్చి వెన్నులో వణుకు పుట్టాలి.. పోరాడతారా..' అన్న ప్రభాస్ మాటలు 'పాపం ఎంత బలమైనదైనా... అంతిమ విజయం సత్యానిదే' అన్న మాటలు అలరించాయి. తెలుగు, హిందీ భాషల్లో అభిమానులకు వినిపించారు.

ఆదిపురుష్ సినిమా కాదు..అదృష్టం.. : ప్రభాస్

ఆదిపురుష్ సినిమా కాదని, అదృష్టం అని



సినీహీరో ప్రభాస్ అన్నారు. జై శ్రీరాం... జై శ్రీరాం.. జై శ్రీరాం అని ప్రసంగం ప్రారంభిస్తూ ట్రైలర్ ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. ఓపెనింగ్స్ అదిరిపోయినట్లుగా భావిస్తున్నానన్నారు. అభిమానుల ఎంకరేజిమెంట్ టీమ్‌ను నడిపించిందని, మీరిచ్చిన ఎంకరేజ్‌మెంట్‌తో యుద్ధం చేశారు. నిద్ర లేకుండా అందరూ పనిచేశారన్నారు. 'రామాయణం చేస్తున్నావా?' అని చిరంజీవి అడిగారని, అదృష్టం నీకు దొరికిందని చెప్పారు. ఫస్టు నుంచి కష్టాలొచ్చాయని, ఓం మంచి ఫైట్ చేశారని, నిద్ర పోకుండా మొత్తం బృందం కష్టపడిందన్నారు. 'పెళ్లెప్పుడు' అని అభిమానులు అడిగినపుడు 'తిరుపతిలో చేసుకుంటాను' అని నవ్వుతూ సమాధానమిచ్చారు. జానకి ఎక్స్‌ప్రెషన్ బాగుందని, హనుమంతుడుతో చేసినపుడు ఎమోషన్‌గా ఫీలయ్యానన్నారు. ఏడాదికి రెండు సినిమాలు చేస్తానని చెప్పారు. మూడు చేయడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. స్టేజిపై తక్కువ మాట్లాడి ఎక్కువ సినిమాలు చేస్తానన్నారు. ఆదిపురుష్ సినిమా కాదని తన అదృష్టమని మరోసారి ఉద్ఘాటించారు.



రూ.85 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం

● ఐదుగురు స్మగ్లర్లపై పీడీయాక్ట్ ● ప్రధాన నిందితులు ఢిల్లీవాసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణాలో స్మగ్లర్లు ఆరితేరిపోయారు. శేషాచలంలో మాత్రమే దొరికే అరుదైన ఎర్రచందనాన్ని ఎలాగైనా సొంతం చేసుకోవడానికి స్మగ్లర్లు నూతన మార్గాలను ఏర్పాటు చేసుకుంటూ నయా దందాలకు తెర తీస్తున్నారు. ఎర్రచందనం స్మగ్లర్ల నయా దందాను చాకచక్యంగా కనిపెట్టి 85 లక్షల విలువగల 72 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు డిఎస్పి యశ్వంత్ తెలిపారు. మంగళవారం చంద్రగిరి పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ ఎర్రచందనం నయా దందా వివరాలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా డిఎస్పి యశ్వంత్ మాట్లాడుతూ తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలతో చంద్రగిరి డిఎస్పి యశ్వంత్ పర్యవేక్షణలో ఎర్రచందనం అక్రమ రవాణా, అడవిలోకి అక్రమ చొరబాట్లపై ప్రత్యేకంగా నిఘా ఉంచి పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం భాకరాపేట సిఐ తులసిరామ్, ఎస్ఐలు, సిబ్బంది కలిసి యర్రావారిపాలెం మండలం, బోడేవాండ్లపల్లి గ్రామ సమీపంలో సాయికాడగుట్ట వద్ద గల ఆంజనేయ స్వామి గుడి దగ్గర అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను, వ్యక్తులను గుర్తించామన్నారు. వెంటనే అప్రమత్తమైన సీఐ తన సిబ్బందితో అనుమానిత వ్యక్తులను చుట్టుముట్టి ఐదుగురు స్మగ్లర్లను, 2 కార్లను, ఒక లారీ, 72 ఎర్రచందనం కొయ్యల చెక్కలు, ఎర్రచందనం కొయ్యల పీసులు 4 మూటలు, 9 మూటల చెక్కల పొడిని స్వాధీనం చేసుకున్నామన్నారు. 42 కేజీల 72 ఎర్రచందనం దుంగల విలువ 40 లక్షల 25 వేల రూపాయలు, 108 కేజీల బరువు గల కట్ చేసిన ఎర్రచందనం కొయ్యల పీసులు 10 లక్షల 80 వేలు, 262 కేజీల బరువు గల ఎర్రచందనం చెక్కల పొడి 26 లక్షల 20 వేలు ఉంటుందని అంచనా వేశామన్నారు. అలానే సీజ్ చేయబడిన టీఎన్ 09 బిడబ్ల్యూ 0262 గల నిస్సాన్ మైక్రో కారు విలువ 3 లక్షలు, టిఎన్ ఏఎఫ్ 0348 నెంబర్ గల మారుతి సుజుకి ఆల్టో కారు లక్ష రూపాయలు, టిఎన్ 33 ఏఏ 1335 నెంబర్ గల అశోక్ లేలాండ్ లారీ విలువ 5 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. తమిళనాడు మన్నాడి ప్రాంతానికి చెందిన మహమ్మద్ రసూల్, జవహర్ నగర్‌కు చెందిన కార్తిక్, పల్లిపట్టుకు చెందిన మరియ భాస్కరన్, ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాకు చెందిన తిరుమలశెట్టి నాగరాజా, అన్నమయ్య జిల్లాకు చెందిన అమరేంద్రరాజు అను స్మగ్లర్లను అరెస్టు చేశామన్నారు. ఇందులో మహమ్మద్ రసూల్ పై ఇదివరకే 25కి పైగా కేసులు ఉన్నాయని గుర్తించామన్నారు. వీరందరిపై పీడీ యాక్ట్ ను ప్రయోగించాలని నిర్ధారణకు వచ్చామన్నారు. స్మగ్లింకు వెనుక ఉన్న ఢిల్లీ సూత్రధారులను త్వరలో అరెస్టు చేస్తామని యశ్వంత్ స్పష్టం చేశారు. ఈ అరెస్టులో ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్ లకు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి రివార్డులు ప్రకటించారు.



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో పోలీస్ అధికారులు

సచివాలయాలకు ట్యాబ్‌లు పంపిణీ

తిరుపతి టౌన్ : వై.ఎస్.ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకము సమగ్ర రీ సర్వే వేగవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన శ్యామ్ సంగ్ గ్యాలక్సి ట్యాబులను మన తిరుపతిలోని 102 సచివాలయాలకు అందించడం జరిగిందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ట్యాబులను పంపిణి చేసిన అనంతరం కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తయ్యిందని, తిరుపతి కార్పొరేషన్ పరిధి 27 స్కైర్ కిలో మిటర్లు, 1800 ఎకరాల్లో, 5 రెవెన్యూ విలేజెస్లో కవర్ అయ్యిందని తెలిపారు. రీసర్వే ప్రకియలో వార్డు సచివాలయ సిబ్బంది, ముఖ్యంగా అడ్మిన్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు, విఆర్వోలు అందరూ వాళ్ళ సచివాలయ పరిధిలో ఎన్ని సర్వే నంబర్లు ఉన్నాయి, ఎంత ఏరియా ఉంది, ఎన్ని ప్రాపర్టీ టాక్స్ అసెస్మెంట్ లు ఉన్నాయనే డేటా ఎంట్రీ వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఈసారి బిజెపి అధికారంలోకి రాదు

చింతామోహన్



మాట్లాడుతున్న చింతామోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ తలకిందులా తపస్సు చేసినా ఈసారి అధికారంలోకి రావడం జరగదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేని విధంగా సామాన్యుడు అల్లాడిపోయేలా వస్తు ధరలు ఉన్నాయని దీనికి కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమని దుయ్యబట్టారు. ఇక 2024లో జరిగే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి గానీ, వైసీపీకి గానీ, జనసేనకు గాని ఓట్లు వేస్తే ఆ ఓట్లన్నీ బిజెపికి వేసినట్టేనని చింతామోహన్ వ్యాఖ్యానించారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటుకు స్థలాలు సేకరించి ఇప్పుడు వాటిలో ఏర్పాటు అయిన పరిశ్రమల్లో ఎనిమిది వేల రూపాయలు ఇస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికులకు వేతనంగా 30 వేలు ఇచ్చేలా పార్లమెంటులో చట్టం తీసుకొస్తామన్నారు. ధార్మిక సంస్థ అయిన తిరుమలలో భక్తుల మలమూత్రాలను శుభ్రపరిచే కార్మికులకు కనీస వేతనంగా 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎట్టకేలకు రైతు పొలానికి సాగునీరు




ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని పూడి గ్రామంలో గిరిజన రైతు వెంకటయ్య వరి పంట ఎండిపోవడంతో ప్రజాశక్తిలో 'అడుగడుగునా నిర్లక్ష్యం' అనే శీర్షికన మంగళవారం ప్రచురణమైన కథనానికి అధికారులు స్పందించారు. తొట్టంబేడు ఎస్పీడీసీఎల్ అధికారులు విద్యుత్ సమస్యలను పరిష్కరించి రైతు పొలానికి నీళ్లు అందేలా చేశారు. సకాలంలో విద్యుత్ సమస్యను పరిష్కరించి ఉంటే నాటిన వరి పైరు చేతికందేదని.. నష్టం వచ్చేది కాదని రైతు వాపోయాడు. ట్రాన్స్‌కో ఏఈ బాలాజీని వివరణ కోరగా మంగళవారం 10 గంటలకు రైతు పొలం వద్దకు వెళ్లి తన సిబ్బందితో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాన్ని సరిచేసి రైతుకు సరఫరా ఇచ్చామని తెలిపారు.

ఆదర్శనేత.. చంద్ర రాజేశ్వరరావు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం కషిచేసిన ఆదర్శ నేత చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్ ప్రభాకర్ కొనియాడారు. మంగళవారం చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా గూడూరు సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఆయన తుది శ్వాస వరకు పేదల అభివద్ధికి అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏ.ఐ.టి.యు.సి . నియోజకవర్గ కార్యదర్శి ఎంబెటి చంద్రయ్య , మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర ,పురుషోత్తం పాల్గొన్నారు.

శ్మశాన ఆక్రమణను తొలగించాలని వినతి



ప్రజాశక్తి-గూడూరు రూరల్ : పగడాలపల్లి పంచాయతీలోని అరుంధతి వాడకు సంబంధించిన 30 సెంట్ల శ్మశాన భూమిని మిట్టత్మకూరుకు సంబంధించిన అగ్ర కులస్తులు ఆక్రమించడానికి సిద్ధమై జెసిబిలతో ఇప్పటికే ఆ భూమిని చదును చేశారు. దీంతో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు పగడాలపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లునాయుడు, ఎంపిటిసి సుబ్బనాయుడు గ్రామస్థులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. దళితులకు సంబంధించిన శ్మశాన భూములను సైతం కొంతమంది పెత్తందారులు ఆక్రమించుఒకుంటున్నారని.. ఈ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లేబాక రమణయ్య, పందేటి రాగయ్య, తుమ్మూరు వెంకటయ్య, ఆత్మకూరు గంగయ్య, యల్లపల్లి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21వ తేదీన నిర్వహిస్తున్న డైనమిక్ ఫైట్ సింగర్-2023 పోటీలకు నియోజకవర్గంలోని సింగర్లు దరఖాస్తులు చేసుకోవాలని డైనమిక్ ఫైట్ సింగర్-2023 వ్యవస్థాపకులు బొప్పన శ్రీనివాస్ తెలిపారు. పోటీలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ప్రోత్సాహక కానుకలను అందిస్తామన్నారు. ఒక్కొక్కరికి ఒక పాటకు ఫ్రీ ఎంట్రీ ఉంటుందని.. అంతకుమించి ఎక్కువ పాటలు పాడదలిస్తే ఒక్కో పాటకు వంద రూపాయలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే పోటీలో పాల్గొనదలిచిన వారు ముందుగా రికార్డింగ్ చేసి పేరు ఫోన్ నెంబరు వయస్సు వివరాలతో ఫోన్ నెంబర్ 950 59 60 598 కు వాట్సప్ చేయాలని సూచించారు. జూన్ 10వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బహుజనులకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బహుజనులకు రాజ్యాధికారం దక్కాలంటే అది బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బహుజనులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని వాపోయారు. దేశ జనాభాలో 40 శాతంగా గా ఉన్న బహుజనులకు రాజ్యాధికారం అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపిస్తున్న బీఎస్పీని ప్రజలు ఆదరించాలని కోరారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గం లో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యచరణ పై చర్చలు జరిపారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.గుర్రప్ప, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు కె.ప్రభాకర్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు పి.జయచంద్ర, ఉపాధ్యక్షుడు ఆర్.పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణంపై విచారణ



ప్రజాశక్తి-కోట: దేవాలయ భూముల్లో సచివాలయ నిర్మాణంపై బిజెపి నాయకుడు పనబాక కోటేశ్వరరావు గతంలో లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం గూడూరు డీఎల్పీవో వెంకటరమణ విచారణ చేపట్టారు. భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయం నిర్మించిన భూమి కోటమ్మ దేవస్థానానికి సంబంధించిందని పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఆలయ భూములుగా ఉన్నాయని తెలిపారు. తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణలో తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని, ఈవోపీఆర్డీ కిరణ్, వీఆర్వో మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం.. స్టాన్‌ఫోర్డ్ పాఠశాల

● కేరళ ఉపాధ్యాయులచే విద్యాబోధన ● విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి



ప్రజాశక్తి-తిరుపతి సిటి

కేరళ వాసులచే నిర్వహించే పూర్తి ఆంగ్ల పాఠశాల స్టాన్‌ఫోర్డ్. కలల సాకారానికి..విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతూ.. చదువుల్లో తమ అనుభవాలను రంగలించి విద్యార్థులకు బోధిస్తూ అత్యుత్తమ ఫలితాలతో స్టాన్‌ఫోర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సంచలనం సృష్టిస్తోందని ఆ స్కూల్ ఛైర్మన్ అల్ఫోన్సా ఫిలిప్ తెలిపారు. స్థానిక నగర్ రైల్వే గేట్ ఆర్సీ రోడ్డు తిరుపతి వద్దనున్న ఆ స్కూల్ ప్రాంగణంలో ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ సేవా దృక్పథం కల్గిన అనుభవజ్ఞులైన కేరళీయులు నిర్వహించే పూర్తి ఆంగ్ల పాఠశాలలో ఉపాధ్యాయ బృందం, నాణ్యతతో కూడిన బోధన విధానం అను చరిస్తున్నామన్నారు. పాఠ్యాంశాలకు సంబంధించిన సమగ్రమైన స్టడీ మెటీరియల్, దానికి అనుబంధంగా వర్క్‌షీట్స్ అందిస్తున్నామని తెలిపారు. విద్యాపరంగా వెనకబడిలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, విద్యతో పాటు లలిత కళలలో అభిరుచిని పెంపొం దించడానికి మ్యూజిక్, డ్యాన్స్ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థికి అదనపు సమాచారం అందించడం కోసం చక్కటి లైబ్రరీ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. మానసిక వికాసానికి, ప్రశాంతతకు యోగా తరగతులు నిర్వహించడం, విద్యార్థుల పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయడానికి తరుచుగా తల్లి దండ్రులు, టీచర్లతో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థి విద్యా సమాచారం తెలియజేసేందుకు తల్లిదండ్రులకు మొబైల్ యాప్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో, విశాలమైన ప్రాంతంలో స్టాన్‌ఫోర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నెలకొల్పామన్నారు. ప్రస్తుతం ఒకటి నుంచి ఏడో తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9502773400, 9390140526 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.



పాఠశాల ప్రత్యేకతలు: పూర్తిస్థాయి నుభవజ్ఞులైన కేరళ టీచర్లచే విద్యాబోధన, ప్రతి విద్యార్థి కచ్చితంగా స్కూల్ ఆవరణలో ఇంగ్లీష్ మాట్లాడటం అలవర్చుట, ప్రణాళిక బద్ధమైన విద్యాబోధన, అందమైన చేతిరాత కోసం ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దష్టి, ఒత్తిడి లేని విద్య, ప్రతి తరగతి గదిలో సీసీటీవీ పర్యవేక్షణ, స్మార్ట్‌బోర్డుతో విద్యాబోధన ఉంటుంది. మ్యాథ్స్, సైన్స్, కంప్యూటర్‌కు సంబంధించిన ల్యాబ్ సౌకర్యం. ప్రతి తరగతికి కేవలం 30 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారు. కోలీగ్రాఫీ, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ ఉంటుంది. ఆన్‌లైన్ ఎగ్జామ్స్ నిర్వహించడం, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌లో ప్రత్యేక శిక్షణ, అటెండెన్స్, హోమ్‌వర్క్, మంత్‌లాగ్, ఎగ్జామ్ షెడ్యూల్, ప్రోగ్రస్ వంటి వాటిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఎడ్యుకేషన్, డిసిప్లేన్, వ్యాల్యూవ్స్, స్పోర్ట్స్, ఫైన్ ఆర్ట్స్. స్కూల్ బస్సు సౌకర్యం ఉందని ప్రిన్సిపల్ వివరించారు.

బీఎన్‌కండ్రిగ ఎంపీడీవోగా నరసింహారావు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బీఎన్‌కండ్రిగ ఎంపీడీవోగా పనిచేస్తున్న రవికుమార్‌నాయుడు వెంకటగిరికి పదోన్నతిపై బదిలీ కావడంతో బుచ్చిరెడ్డిపాలెంలో ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఆయన స్థానంలో డివి నరసింహారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

7న ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: ముంబైలోని ఉల్వే ప్రాంతంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం జూన్ 7వ తేదీ ఉదయం శాస్త్రోక్తంగా భూమి పూజ జరుగనుంది. బుధవారం ఉదయం 6-30 నుండి 7-30 గంటల మధ్య మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ సిండే, ఉప ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్, టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బా రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి వేద మంత్రోచ్చారణల మధ్య భూమి పూజ నిర్వహించనున్నారు. ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం టీటీడీకి రూ.10 ఎకరాల భూమి కేటాయించింది. ఈ భూమిలో దాదాపు రూ.100 కోట్లతో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం నిర్మించడానికి రేమాండ్స్ కంపెనీ అధినేత గౌతమ్ సింఘానియా ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. భూమి పూజ కార్యక్రమంలో ఆయన కూడా పాల్గొననున్నారు.

ప్రభుత్వాసుపత్రికి వైద్య పరికరాల పంపిణీ



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కేంద్రానికి వైద్యాధికారిణి మాధవీలత ఆధ్వర్యంలో ఆశా దినోత్సవం సందర్భంగా సేవ్ ది చిల్డ్రన్ అనే సేవా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ హేమంత్, బందం వైద్యపరికరాలను అందించారు. గ్రామాల్లో మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా సాయం వైద్యపరికరాలు పంపిణీ చేశారు. అనంతరం ఆశ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దివాకర్, సూపర్వైజర్లు సుబ్రహ్మణ్యం, గౌరి, సేవ్ ద చిల్డ్రన్ మునెమ్మ, గీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శోభన్‌నాయుడు జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి -తొట్టంబేడు: తొట్టంబేడు మండలం వైసీపీ నేత శోభన్‌నాయుడు జన్మదినం వేడుకలు మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ కలవగుంట భరత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శోభన్ నాయుడును కలవగుంట భరత్ రెడ్డి గజమాలతో సన్మానం చేశారు. శోభన్ నాయుడు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్తీక్‌నాయుడు, ధనశేఖర్, నత్తం హరిబాబు, కార్తీక్, బాలు, చంద్ర, బాలాజీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాద స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ చెన్నాయిగుంట గ్రామ లెక్కదాఖల సర్వే నెంబర్ 229 కోళ్లఫారాలు గల భూమిపై వివాదం నెలకొన్న నేపథ్యంలో తిరుపతి తహశీల్దార్ వెంకటరమణ ఆదేశాలతో వీఆర్ఓ భూపతి ఆచారి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. భూ వివాదం ఉన్న నేపథ్యంలో ఇరు గ్రూపులకు చెందిన వారు ఎవ్వరూ ప్రవేశించరాదని సిఆర్పిసి సెక్షన్ 145 అమలులో ఉన్నందున అతిక్రమించి ప్రవేశించిన, నిర్మాణాలు చేపట్టిన అట్టి వారిపై సివిల్, క్రిమినల్ కేసులు వంటి చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పంట కాలువల అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు



ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని వంకీన గుంట, నాయుడు కాలువ కట్ట, దూడల కాలువలను ఎమ్మెల్యే వరప్రసాద్ రావు ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ పంట పొలాలకు నీరు వెళ్లే ప్రధాన కాలువలను గతంలో శుభ్రపరిచామని పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు మట్టి పేరుకుపోయి నీటిపారుదల సక్రమంగా జరగడంలేదని తెలిపారు. మట్టిని తొలగించి జంగిల్ క్లియరెన్స్ పనులు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని.. రైతులందరూ సహకరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ సమావేశాలను జయప్రదం చేయండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తిరునగరి వేదికగా ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న సీఐటీయూ రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర సమావేశాల కరపత్రాలను, గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. మోడీ పాలనలో కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. కార్మిక చట్టాలను నీరుగార్చి కార్పొరేట్లకు బానిసలుగా చేసే కుట్రపూరిత చీకటి జీవోలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాంతరంగా అమలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతగా జగన్ కార్మికులకిచ్చిన క్రమబద్ధీకరణ హామీని ఇప్పటివరకు అమలుపరచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం అటకెక్కిందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్లకు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించే స్థితిలో లేదని వాపోయారు. కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా తిరుపతిలో నిర్వహిస్తున్న సీఐటీయూ రాష్ట్ర సమావేశాల్లో పలు కీలక తీర్మాణాలు చేయనున్నట్టు చెప్పారు. 12వ తేదీ సాయంత్రం నిర్వహించే భారీ బహిరంగ సభకు కార్మికులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. గంధం మణి, పెనగడం గురవయ్య, ఈశ్వరయ్య, కుమార్, వెంకటేష్, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యలో సమూల మార్పులు




ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండురోజుల పాటు 'వ్యవసాయ పరిశోధన- పోషకాహార భద్రత' అనే అంశంపై పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీమ జగ్గి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ తరహా సదస్సులను జాతీయ స్థాయిలో అన్ని విశ్వవిద్యాలయాల్లో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సు ముఖ్యంగా విద్యార్థుల్లో పరిశోధనపై అవగాహనతో పాటు వివిధ రాష్ట్ర విద్యార్థులతో పరస్పర విజ్ఞాన మార్పిడికి, సమాచార మార్పిడికి, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని అభిప్రాయ పడ్డారు. వ్యవసాయ విద్యకు సంబంధించిన రానున్న రోజుల్లో సిలబస్, బోధన, ఇతర అంశాలలో అనేక మార్పులు తీసుకుని వస్తున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం అచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ వర్సిటీ ఆధ్వర్యంలో పి.జి దశలో పరిశోధనల నాణ్యతను పెంపొందించేందుకు అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ పి.జి డీన్ డాక్టర్ గుత్తా రామారావు మాట్లాడుతూ రెండురోజుల పాటు జరిగిన జాతీయ సదస్సుతో దేశం నలుమూలల నుంచి 570 మంది పి.జి విద్యార్థులు హాజరై విజయవంతం చేశారన్నారు. సదస్సులో రెండు రోజు ఉదయం నుంచి పరిశోధక విద్యార్థులు ఆహార భద్రత-పోషకాహారం కొరకు వివిధ పంటల్లో నూతన రకాల రూపకల్పన, ఆధునిక సాగు పద్ధతులు, పంటల ఆరోగ్య సంరక్షణలో విన్నూత్న మెలుకువలు, వాతావరణ మార్పులపై పరిశోధన, వాతావరణ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం పెంపు, వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతికత అభివద్ధి, పశుపోషణలో మెలుకువలు, రైతులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంలో ఎదురవుతున్న సవాళ్లు అనే అంశాలపై చర్చాగోష్టులు నిర్వహించి ఉత్తమ పరిశోధనాంశాలకు బహుమతులు, ప్రశంసాప్రతాలను అందజేశారు. సమావేశంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, పరిశోధనస్థానం ఏడీఆర్ డాక్టర్ సి.రమణ, డాక్టర్ సత్యగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

'రాజీవ్‌నగర్' కథ కంచికేనా..!



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అధికార వ్యవస్థలను అడ్డు పెట్టుకొని ప్రజా సంపదను దోచుకోవడంలో ఆరితేరిన దోపిడీ దారులకు కల్పతరువుగా మారిన రాజీవ్‌నగర్ అక్రమాల విచారణ కథ కంచికి చేరినట్టేనా అని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గూడు లేక ఇబ్బందులు పడుతున్న శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని దిగువ మధ్యతరగతి, పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించే ఉద్దేశంతో 2006-07లో ఆనాటి ప్రభుత్వం రాజీవ్ నగర్ పేరుతో ఏడు వేల మంది లబ్ధిదారులకు సరిపడా ఇంటి స్థలాలను పంపిణీ చేసిందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాలలోని ప్రభుత్వ భూములు అన్యా క్రాంతం కావడం జోరందుకుందని, కబ్జా చేసిన వారిపై కనీస చర్యలు లేకపోవడం కారణంగానే అక్రమార్కులు తమ దోపిడీని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని ఉమేష్ ఆరోపించారు. సుమారు ఐదు వందల కోట్లకు పైగా విలువ కలిగిన రాజీవ్‌నగర్ టౌన్‌షిప్ ఇంటి పట్టాల పంపిణీలో జరిగిన అవకతవకలకు కారణమైన దళారులను పట్టుకోవాల్సిన రెవెన్యూ, పురపాలక, పోలీసు శాఖలు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో పనిచేసే చిరుద్యోగిని పట్టుకొని చేతులు దులుపుకోవడం విచారణ తీరుపై అనుమానం కలిగిస్తోందని ఉమేష్ పేర్కొన్నారు. ఇంత పెద్ద కుంభకోణం విచారణను తాలూకా స్థాయి అధికారుల చేతుల్లో పెట్టి మమా అనిపించడం అత్యంత బాధ్యతారాహిత్యం అని ఉమేష్ దుయ్యబట్టారు.

ఇసుక క్వారీలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి-వాకాడు: చిట్టమూరు మండల పరిధిలోని మెట్టు గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నదిలో జరుగుతున్న ఇసుక రీచ్ గుంటలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతిచెందిన వ్యక్తి కోట మండలం ఊనుగుంటపాలెం పంచాయతీలోని రుద్రవరం గ్రామానికి చెందిన దూడల ముత్యాలయ్య(40)గా గుర్తించారు. సోమవారం సాయంత్రం ఇసుక రీచ్‌ని దాటుకుని మెట్టు గ్రామాని వెళ్లిన ముత్యాలయ్య తిరిగి స్వగ్రామానికి వచ్చే క్రమంలో క్వారీ గుంతలో ఇరుక్కుని మృతిచెంది ఉండవచ్చని గ్రామస్థులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం క్వారీలో ఆయన మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గ్రామాలకు సమీపంలో నిబంధనలు పక్కనపెట్టి కేవలం ఇసుక వ్యాపారం కోసం లోతైన గుంతలు చేయడంతో ప్రమాదంగా మారిన రీచ్‌ను రద్దు చేయాలని ఇప్పటికే ఆ గ్రామ ప్రజలు పార్టీలకతీతంగా పలుమార్లు ధర్నాలు చేసి ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో క్వారీ కారణంగా ఓ నిండు ప్రాణం బలి కావడంతో గ్రామస్థులు అధికారులపై మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక క్వారీని లేకుండా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ...



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: శుద్ధమెట్ట గిరిజన కాలనీ మలుపు వద్ద మంగళవారం ఉదయం తమిళనాడుకు చెందిన మురుగేషన్(37) శ్రీకాళహస్తి నుంచి చెన్నై వైపు వెళుతుండగా మధ్యలో మలుపు వద్ద అదుపు చేయలేక కేటీ రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై మంజునాథరెడ్డి కేసు నమోదు చేశారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: సచివాలయాల్లో అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని.. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. మంగళవారం మండలంలోని బీజీఆర్ ఎస్‌టీ కాలనీ, గోవర్ధనపురం గ్రామ పరిధిలో నిర్వహించిన గడపగడప కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకున్నారు. అనిల్ కాలనీలో కొన్ని దశాబ్దాలుగా వర్షపు నీరు దిగువనున్న కాలువలోకి వెళ్తుండగా ఓ ప్రైవేటు ప్రాపర్టీ యాజమాన్యం అడ్డంగా ప్రహరీ కట్టడంతో వర్షపునీరు ఎటూ వెళ్లకుండా నిల్వ ఉండిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని..జిల్లా కలెక్టర్‌కి స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఎమ్మెల్యే దష్టికి తీసుకొచ్చారు. మరమగ్గాలతో జీవనం సాగిస్తున్న నేతన్నలు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. అలాగే మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గోవర్ధనపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన డెస్కులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వరదయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, తహశీల్దారు గౌరీ శంకర్, ఎంఈవో సరస్వతి, ఎస్సై నాగార్జున రెడ్డి, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: తిరుపతి సమీపంలోని పాతకాల్వ (పేరూరు బండపై) వద్ద ఉన్న శ్రీ వకుళమాత ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాన్ని శుద్ధి చేసి, పసుపు, కుంకుమ, చందనం, సీకాయ, కర్పూరం, కిచిలిగడ్డ, కస్తూరి పసుపు, పచ్చాకు తదితరాలతో తయారుచేసిన సుగంధ మిశ్రమాన్ని గర్భాలయ గోడలకు ప్రోక్షణ చేశారు.

13న వార్షికోత్సవం: ఈనెల 13వ తేదీన శ్రీ వకుళమాత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విశ్వక్సే నారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠ, కలశారాధన, మహా శాంతి హోమం, పూర్ణాహుతి, అమ్మవారి ఉత్సవర్లకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించనున్నారు. ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దళితుల సమస్యలపై పోరాడుతున్న టిడిపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయులపై ఉద్దేశపూర్వకంగా వైసిపి మూకలు దాడి చేసి అరెస్టు చేయించారని, ఇది అప్రజాస్వామికమని టిడిపి ఎస్సీ సెల్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు శ్రీపతిబాబు అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 29 మంది దళిత ఎమ్మెల్యేలు ఉంటే అందులో ఏకైక ప్రతిపక్ష పార్టీ టిడిపి నుండి ఎమ్మెల్యేగా బాల వీరాంజనేయులు ఉన్నారన్నారు. దళితులకు జరుగుతున్న అవమానాలు, దళితులపై వివక్ష, దాడులు, ప్రశ్నించిన దళితులపై అక్రమకేసులు బనాయించడం, నిధులు దారి మళ్లించడం వంటి సమస్యలపై గళం ఎత్తిన ఎమ్మెల్యే బాల వీరాంజనేయులును పోలీసులు హౌస్ అరెస్టు చేయడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM 1ST CLASS MAGISTRATE :: PUTTUR
O.S. No. 299/ 2022

BETWEEN:-
S.M. Damodaram ..... Petitioner/Plaintiff
AND:-
R. Annadorai and another ...Respondents/Defendants

NOTICE TO 2nd RESPONDENT / DEFENDANT

A.K. Yuvaraj,
S/o A. Kollapuri Mudali,
Chitrangi Kota Street,
Narayanavannam Village
and Mandal, Tirupati District.

The Plaintiff filed a suit against the defendants. The above suit posted for your appearance of the defendant No.2 before this Hon'ble court on 04.07.2023 in person or through your Advocate at about 10.30 AM and file your objections if any otherwise the matter will be decided Ex-Party.
Date of hearing : 04-07-2023.

B. RAVEENDRA, B.Sc., B.L.
U.S. RAYUDU, M.Sc., B.L.,
P.G. VENKATESH, B.Sc., B.L.,
U.S. PRAZWAL, M.B.A., L.L.M,
A. DEEPAK, M.B.A., L.L.B.,
Advocates/Puttur.

IN THE COURT OF THE HON'BLE X ADDITIONAL DISTRICT JUDGE : TIRUPATI
A.S. NO. 24 of 2022
(O.S.No.138 of 2013 judgment dated 11.04.2018 on the file of I Additional Junior Civil Judge of Tirupati)

Between:
Shaik Chotima Bee & 3 Others ...Appellants
V/s
Shaik Beebi Jan & 8 Others ...Respondents

APPEAL NOTICE TO RESPONDENTS 4, 8 AND 9

Respondent No.4:
Dilshad Begum, W/o Shaik Madaar Saheb, previously residing at Pachikapalam village and Post, Ramachandrapuram Mandal, Chittoor District, presently residing at Pachikalava Village, Boligadda Post, Vadamalapeta Mandal, Tirupati District. **Respondent No.8:**
Shaik Haseena, D/o Shaik Nazeer Saheb
Respondent No.9:
Shaik Sabeena, D/o Shaik Nazeer Saheb
Both are residing at Gollavari Kaluva, Thondavada Post, Pichinaidupalli Panchayat, Chandragiri Mandal, previously Chittoor District, presently Tirupati District.

Appeal against judgment and decree in O.S. No.138/2013 on the file of I Additional Junior Civil Judge, Tirupati dt.11.04.2018 with costs throughout. Please take appeal notice to the Respondents No. 4, 8 and 9. Please be present or through your counsel/advocate before the Hon'ble X Additional District Judge, Tirupati on 15.06.2023 at 10.30 A.M otherwise, the matter will re decided as exparte.

VELLORE G.GANESH
ADVOCATE - TIRUPATI. Cell: 9849144819